రేపు ఉమ్మడి జిల్లాల యోగా ఎంపికలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 24: ఉమ్మడి జిల్లా యోగా ఎంపికలను బుధవారం నిర్వహించనున్నామని ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డిలోని యోగా భవన్‌లో ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్-14, 17 బాల బాలికల విభాగంలో ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు బోనాఫైడ్‌ను వెంట తెచ్చుకోవాలని కోరారు. ఆసక్తిగల క్రీడాకారులు 9347216426 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వణికిస్తున్న వ్యాధులు



- జిల్లాలో వర్షాలు తగ్గినా.. విజృంభిస్తున్న వ్యాధులు
- గ్రామాల నుంచి మున్సిపాలిటీల వరకు పెరిగిన వ్యాధులు
- జ్వరాలు, డెంగీ కేసులతో రోగుల ఇబ్బందులు
- చికిత్స కోసం ఆసుపత్రులకు క్యూ కడుతున్న రోగులు
- ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పెరిగిన రోగుల సంఖ్య
- ప్రైవేటు ఆసుపత్రుల్లో డెంగీ పేరిట కొనసాగుతున్న దోపిడీ

జిల్లాను వ్యాధులు వణికిస్తున్నాయి. పిల్లల నుంచి పెద్దల వరకు జ్వరాల బారిన పడి అనేక మంది ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. రక్త పరీక్షల్లో డెంగీ, టైఫాయిడ్ నిర్ధారణ అవుతుండటంతో చికిత్స పొందుతున్నారు. జిల్లాలో వర్షాలు తక్కువముఖం పట్టినా.. వ్యాధుల తీవ్రత మాత్రం కొనసాగుతూనే ఉంది. దోమల బెడదతో డెంగీ కేసులు కూడా ఎక్కువగా అవుతున్నాయి.

నిజామాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో వర్షాలు తగ్గుముఖం పట్టినా.. వ్యాధుల తీవ్రత తగ్గడం లేదు. దోమలు పెరగడంతో గ్రామం నుంచి మున్సిపాలిటీ వరకు జ్వరాలు, డెంగీ, ఇతర వ్యాధులు భారీగా పెరిగాయి. దగ్గు, జలుబు, శ్వాసకోశ సమస్యలతో పాటు డెంగీ, చికున్‌గున్యాతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ ఇంట్లో ఈ తీవ్రత ఉండటంతో తప్పనిసరిగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. దోమలు పెరగడం వ్యాధుల తీవ్రత ఎక్కువ కావడంతో ఎక్కువ మందికి ఒళ్లు నొప్పులు ఎక్కువగా ఉండటం వల్ల రోజుల తరబడి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులల్లో ఉచితంగానే చికిత్సలు అందిస్తున్నా.. ప్రైవేటు ఆసుపత్రుల్లో వేల రూపాయలను ఖర్చు చేస్తున్నారు. పరీక్షలకు, మందులకు ఎక్కువ మొత్తంలో వెచ్చిస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చేర్చుకోవడంతో పాటు డెంగీ పేరిట ఎక్కువ మొత్తంలో డబ్బులను ఖర్చు చేస్తున్నారు.

తగ్గని వ్యాధుల తీవ్రత

జిల్లాలో రెండు నెలలు గడిచినా వ్యాధుల తీవ్రత తగ్గడం లేదు. ఇప్పటికీ ప్రతీరోజు వందల మంది వ్యాధుల బారిన పడుతున్నారు. వైరల్ ఫీవర్‌లు, డెంగీ, ఇతర వ్యాధులతో ఇబ్బందులు పడుతూ ఆసుపత్రులకు చికిత్స కోసం వస్తున్నారు. అవసరమైన వారు ఓపీ ద్వారా చికిత్స పొందుతుండగా సీరియస్‌గా ఉన్న వారు ఆసుపత్రుల్లో చేరుతున్నారు. పూర్తిస్థాయిలో చికిత్స తీసుకుంటున్నారు. వర్షాలు భారీగా పడటం, జిల్లాలో అన్ని చోట్ల నీళ్ల నిలువ ఉండటం వల్ల దోమల తీవ్రత భారీగా పెరిగింది. దోమల లార్వా కోసం మున్సిపాలిటీలతో పాటు గ్రామాల్లో స్ప్రే చేయకపోవడం వల్ల ఎక్కువ మొత్తంలో దోమలు పెరిగాయి. లార్వాను ముందే తగ్గించేందుకు చర్యలు తీసుకుంటే జ్వరాల తీవ్రత తగ్గే అవకాశం ఉన్నా వర్షాలు పడుతున్న సమయంలో పట్టించుకోకపోవడం వల్ల ప్రతీ గ్రామంలో జ్వరాలతో బాధపడే వారి సంఖ్య పెరిగింది.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ..

ప్రైవేటు ఆసుపత్రులపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పర్యవేక్షణ కొరవడడం వల్ల ప్రైవేటు ఆసుపత్రులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ప్రత్యేక వైద్యసేవల పేరిట దోపిడీకి పాల్పడుతున్నాయి. వైద్యులు జ్వర తీవ్రత ఎక్కువగా ఉన్న వారికి ఆంటీజన్ టెస్టులు చేసి డెంగీగా నిర్ధారిస్తూ ఆసుపత్రిలో చేర్చుకుంటున్నారు. వేలకు వేల రూపాయలు వైద్యం కింద ఫీజులను వసూలు చేస్తున్నారు. జిల్లా అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ప్రైవేటు ఆసుపత్రులు వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నాయని రోగులు వాపోతున్నారు.

జిల్లాలో నిర్వహించిన ఇంటింటి జ్వర సర్వేలో కూడా ఈ విషయం వెల్లడైంది. సాధారణ జ్వరాలతో పాటు డెంగీతో బాధపడే వారి సంఖ్య బయటపడింది.

గ్రామాల్లో జ్వర సర్వే

జిల్లాలో అన్ని గ్రామాల పరిధిలో ఇంటింటి సర్వే చేపట్టగా సుమారు 20వేలకు పైగా ఈరెండు నెలల్లో జ్వరాల బారిన పడినట్లు గుర్తించారు. ఎక్కువ మంది సాధారణ జ్వరాలతో పాటు వైరల్ ఫీవర్ బారిన పడ్డారు. దగ్గు, జ్వరము, జలుబు, శ్వాసకోశ వ్యాధులతో ఎక్కువగా ఇబ్బందులు పడ్డారు. ఇవే కాకుండా డెంగీ సంబంధిత లక్షణాలతో ఎక్కువ మంది ఆసుపత్రుల పాలవుతున్నారు. జిల్లాలోని దుబ్బ, అర్సపల్లి, ముదక్‌పల్లి, ఇందల్వాయి, గౌతంనగర్, వినాయక్‌నగర్, పోచంపాడ్‌తో పాటు పలు పిహెచ్‌సీల పరిధిలో డెంగీ కేసులు నమోదు అయ్యాయి. జిల్లాలో ఈ రెండు నెలల్లోనే సుమారు 300లకు పైగా డెంగీ కేసులను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ఫాగింగ్ చేయడంతో పాటు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పెరిగిన ఓపీ కేసులు

నిజామాబాద్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఓపీకి భారీగా రోగులు వస్తున్నారు. ప్రతీరోజు 2400 నుంచి 2800 మధ్యన రోగులు ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందుతున్నారు. ప్రతీరోజు సాధారణ జ్వరాలతో వచ్చే వారు సుమారు 200 నుంచి 300 వరకు ఉంటున్నారు. వీరిలో సీరియస్‌గా ఉన్న వారికి ఆసుపత్రిలోనే చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో 50 మంది వరకు చికిత్స పొందుతున్నారు. వీరిలో పది మంది వరకు డెంగీతో ఇబ్బంది పడుతున్న వారు ఉన్నారు. ఈ ఆసుపత్రితో పాటు జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులకు గడిచిన రెండు నెలలుగా వచ్చే వారి సంఖ్య పెరిగింది. బోధన్, ఆర్మూర్ ఆసుపత్రులతో పాటు ఇతర ఆసుపత్రుల్లో కూడా ఎక్కువ మంది చేరుతున్నారు. పీహెచ్‌సీ పరిధిలో కొన్ని చోట్ల డాక్టర్లు రాత్రి సమయంలో అందుబాటులో ఉండకపోవడం వల్ల ఎక్కువ మంది జిల్లా కేంద్ర ఆసుపత్రికే వచ్చి చికిత్స పొందుతున్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో దోపిడీ

జిల్లాలో వ్యాధుల తీవ్రత పెరగడం వల్ల ప్రైవేటు ఆసుపత్రుల్లో దోపిడి భారీగా పెరిగింది. సాధారణ జ్వరాలతో వారి కూడా ఎక్కువ మొత్తంలో పరీక్షలను నిర్వహిస్తున్నారు. భారీ ఎత్తున డబ్బులను పరీక్షల కోసం తీసుకుంటున్నారు. సాధారణ జ్వరాలతో ప్రైవేటు ఆసుపత్రులకు వస్తున్న వారు కూడా పరీక్షలు, మందులకు కలిపి 2వేల నుంచి 3వేల వరకు ఖర్చు అవుతుంది. ఆసుపత్రిలో చేరే వారికి 20 నుంచి 40వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. కొన్ని ఆసుపత్రుల్లో 40 నుంచి 80వేల రూపాయల వరకు కూడా తీసుకుంటున్నారు. స్పెషలిస్టు సేవల పేరు మీద ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నారు. కొత్తగా వెలసిన ఆసుపత్రి యాజమాన్యాలు గ్రామీణ వైద్యులతో ఒప్పందాలు చేసుకొని తమ ఆసుపత్రులకే రోగులు వచ్చే విధంగా చూసుకుంటున్నారు. వారి వద్ద నుంచి ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తూ పంపించిన వారికి కమీషన్‌లను ముట్టచెబుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో రోగులకు ఎక్కువ మొత్తంలో మందులను రాస్తున్నారు. ప్రతీ ఆసుపత్రికి మెడికల్ షాపు ఉండటం వల్ల వారి వద్దనే దొరికే మందులను అందిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో డబ్బులను వసూలు చేస్తున్నారు.

జిల్లాలో వ్యాధుల తీవ్రత ఉంది..

: జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్

జిల్లాలో వ్యాధుల తీవ్రత ఎక్కువగానే ఉందని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ తెలిపారు. దోమలు బాగా పెరగడం వల్ల ఈ వ్యాధులు ఎక్కువగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఇప్పటికే పలు పీహెచ్‌సీల పరిధిలో వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. డెంగీ కేసులు కూడా కొన్ని పీహెచ్‌సీల పరిధిలో పెరిగాయన్నారు. ఆ ప్రాంతాల్లో అవగాహన కల్పించడంతో పాటు ఫాగింగ్ చేస్తున్నామని ఆయన తెలిపారు.

జిల్లా కేంద్ర ఆసుపత్రికి వ్యాధులతో వచ్చే వారి సంఖ్య భారీగా పెరిగిందని సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమ రాజ్ తెలిపారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం ఎక్కువ మంది వస్తున్నారని అన్నారు. వచ్చే వారిలో జ్వరాలతో బాధపడే వారు పది శాతంలోపు ఉంటున్నారని అన్నారు. ప్రతిరోజూ ఆసుపత్రికి ఓపీ కింద వచ్చేవారు 2400 నుంచి 2800 మధ్య ఉంటున్నారని ఆమె తెలిపారు. ఆసుపత్రిలో అన్ని రకాల ఏర్పాట్లు చేశామని అందరికి వైద్యం అందిస్తున్నామని ఆమె తెలిపారు. సీరియస్‌గా ఉన్న వారిని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నామని ఆమె తెలిపారు.



• ఓపీ వద్ద బారులు తీరిన రోగులు



• ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

కట్టుదిట్టంగా ఓటరు జాబితా సవరణ చేపట్టాలి

- చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 24: ఓటరు జాబితా సవరణ ప్రక్రియను కట్టుదిట్టంగా చేపడుతూ నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పెషల్ సమ్మరీ రివిజన్ ఈ.ఆర్.వో 2.0 తదితర అంశాలపై కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణలో భాగంగా కొనసాగుతున్న ఇంటింటి సర్వే ప్రక్రియ వేగవంతమైందని వారం రోజుల వ్యవధిలో 55 శాతం నుంచి 95 శాతానికి చేరుకుందని జిల్లా కలెక్టర్లను అభినందించారు. మరో ఐదు రోజుల వ్యవధి మాత్రమే మిగిలి ఉన్నందున గడువులోపు ఇంటింటి సర్వేను వంద శాతం పూర్తి చేయాలన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రాన్ని తప్పనిసరిగా సందర్శించాలని తద్వారా ఓటరు జాబితాలో ఎలాంటి సాంకేతిక తప్పిదాలు చోటు చేసుకునేందుకు అవకాశం ఉండదని తెలిపారు. ఓటరు నమోదు మార్పు చేర్పులకు సంబంధించి ఫారం-6ఏ, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను త్వరితగతిన పరిశీలన జరపాలని సూచించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

ఇంటింటి సర్వేలో ఆధార్ నెంబర్ సేకరణ తప్పనిసరి కాదని ఓటర్లు ఇష్టముంటే ఇవ్వవచ్చని బలవంతం చేయరాదన్నారు. ఇంటింటి సర్వే సంబంధించి వచ్చిన నూతన ఓటరు నమోదు దరఖాస్తుల వివరాలు ఎస్ఎస్ఆర్ 2025తో ముడిపడిన అంశాలను ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్ పాల్గొన్నారు.

నవంబరు 6 లోపు ఓటరుగా నమోదు చేసుకోవాలి

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 24: ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటరు నమోదును ఈనెల 30 నుంచి నవంబర్ 6 వరకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఓటరు నమోదుపై సమీక్ష నిర్వహించారు. నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు చెందిన అర్హతకలిగిన ఓటర్లు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. నాలుగు జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ శాసన మండలి నియోజకవర్గ స్థానంతో పాటు పట్టభద్రుల శాసనమండలి స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రస్తుత ఎమ్మెల్సీ సభ్యుల కాల పరిమితి 2025 మార్చి 29తో ముగియనుందని తెలిపారు. ఖాళీ అయిన స్థానాలకు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా అర్హత కలిగిన ఓటర్ల పేర్ల నమోదు కోసం అవకాశం కల్పిస్తూ ఈనెల 30న పబ్లిక్ నోటీస్‌ను జారీ చేయనుందని తెలిపారు. అక్టోబర్ 16, 25వ తేదీలలో రెండు పర్యాయాలు ప్రకటనలు జారీ చేస్తున్నామన్నారు. నవంబరు 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గతంలో ఓటు హక్కు వినియోగించుకున్న వారు సైతం తప్పనిసరిగా ఓటు హక్కును నమోదు చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నవంబర్ 23న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించడం జరుగుతుందన్నారు. నవంబరు 23 నుంచి 9 వరకు అభ్యంతరాలు తెలపవచ్చని అన్నా రు. డిసెంబర్ 30న ఓటరు జాబితాను వెలువరించడం జరుగుతుందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్లు ఫారం-18, ఉపాధ్యాయ నియోజకవర్గం ఓటర్లు ఫారం-19ను దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రధానోపాధ్యాయులకు ఎంఈవోలుగా బాధ్యతలు

- ఉమ్మడి జిల్లాలో ఎంఈవో పోస్టుల భర్తీపై దృష్టి సారించిన ప్రభుత్వం

కోటగిరి, సెప్టెంబరు 24: ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర వ్యాప్తంగా సీనియర్ హెడ్‌మాస్టర్లను ఎంఈవోలుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిజామాబాద్ జిల్లాలో 33మండలాలకు ఒకరు పూర్తిస్థాయి ఎంఈవోగా ఉండగా 32ఖాళీలు ఉన్నాయి. ఇప్పటి వరకు ఒక్కో ఎంఈవోకు 9 నుంచి 10మండలాలు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కామారెడ్డి జిల్లాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో 58మంది ప్రధానోపాధ్యాయులకు పూర్తిస్థాయి ఎంఈవో బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత కొన్ని సంవత్సరాలుగా పూర్తిస్థాయి ఎంఈవోలు లేకపోవడంతో విద్యాశాఖపై అజమాయిషి కరువైంది. ప్రస్తుతం పూర్తిస్థాయి ఎంఈవోలను నియమించడంతో పాఠశాలల పర్యవేక్షణ, విద్య వ్యవస్థ మెరుగుపడనుంది.


సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 24: జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలని యూఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ సంక్షేమ అధికారి నిర్మలకు వినతి పత్రం అందజేశారు. నగరంలోని నూతన కలెక్టరేట్ కార్యాలయంలోని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ.. ఎస్సీ హాస్టళ్లలో కనీస సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న హాస్టళ్లు అద్దె భవనాలు ఉండటం వల్ల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సరిపడా గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నగరంలోని న్యాల్‌కల్ ఎస్సీ-బీ హాస్టల్‌లో డ్రైనేజీ సమస్య వల్ల మురికి నీరు హాస్టల్ పరిసరాల్లో ఉండటం వల్ల దుర్వాసన, దోమల బెడద ఎక్కువై ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. హాస్టల్‌లో భోజనం సరిగా లేకపోవడంతో కొందరు విద్యార్థులు బయటి ఆహారం తిని రోగాలు కొనితెచ్చుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు శివ, వేణు, ఆశీర్వాదం, మారుతి, కృష్ణ పాల్గొన్నారు.

నగరంలో నిబంధనలు పాటించకుండా నిర్మాణం చేపడుతున్న భవనం



యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు!

- నగరంలో విచ్చల విడిగా అక్రమ కట్టడాలు
- అనుమతి తీసుకుంటున్న ప్లాన్ ఒకటి, కట్టడం మరొకటి
- ఎలాంటి సెట్‌బ్యాక్ లేకుండానే నిర్మాణాలు
- నిబంధనలు చూడకుండానే అధికారుల అనుమతులు
- టౌన్‌ప్లానింగ్ అధికారులపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 24: నగరంలో విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు చేపడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే భారీ స్థాయి భవనాలు నిర్మిస్తున్నారు. ఇరుకైన స్థలాల్లో భారీ నిర్మాణాలు చేపట్టి సామాన్య ప్రజలకు ఇబ్బందులు సృష్టిస్తున్నారు. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో ఇరుకైన స్థలాల్లోనే బడా బడా షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మాణాలు చేపట్టి కనీసం పార్కింగ్ లేకుండా వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. నగరంలో భవనం నిర్మించడానికి నగర పాలక సంస్థలోని టౌన్‌ప్లానింగ్ విభాగం అనుమతి మంజూరు చేయాల్సి ఉంటుంది. అనుమతుల కోసం టీఎస్‌బీ పాస్‌లో ఆన్‌లైన్‌లో అప్లై చేస్తే టౌన్‌ప్లానింగ్ అధికారులు పరిశీలన అనంతరం అనుమతులు ఇవ్వాల్సి ఉండగా ఇవేమి లేకుండానే అనుమతులు ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగర పాలక సంస్థ అధికారులు అనుమతుల విషయంలో కనీస నిబంధనలు చూడకుండానే అనుమతులు ఇస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా టౌన్‌ప్లానింగ్‌పై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఆమ్యామ్యాలు ముట్టచెబితే ఎలాంటి నిబంధనలు లేకుండానే అనుమతులు ఇస్తున్నారంటూ సోషల్ మీడియాలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టౌన్‌ప్లానింగ్ అధికారులపై కలెక్టర్‌కు అనేకసార్లు ఫిర్యాదులు వెల్లువెత్తిన టౌన్‌ప్లానింగ్ విభాగంలో మార్పు రావడం లేదు. నగరంలోని ఇరుకైన స్థలాల్లో భారీ వ్యాపార సముదాయాలకు అనుమతులను ఇస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఇటీవల నగరంలోని రాష్ట్రపతి రోడ్‌లో ఓ వస్త్ర వ్యాపార సముదాయానికి ఎలాంటి సెట్‌బ్యాక్ లేకుండా అనుమతులు ఇచ్చారు. దీనికి కనీసం అగ్నిమాపక శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేవు. కనీసం టీఎస్‌బీపాస్‌లో వారు అనుమతిని కూడా అడగలేదు. ఇలాంటివి నగరంలో కోకొల్లలుగా ఉన్నాయి. నగరంలోని బడా వ్యాపార సంస్థలు సెల్లార్లో సైతం తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. రోడ్లపైనే పార్కింగ్ చేయడంతో అటుగా వచ్చే వాహనదారులకు ఇబ్బందిగా మారింది. పండగల సమయాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్‌లో ఇరుక్కొని ఇబ్బందులు పడుతున్నారు.

అనుమతులు లేకుండానే భారీ ఫ్లెక్సీలతో ప్రచారం..

ఎలాంటి అనుమతులు లేకుండానే భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఆటోలకు కూడా నిబంధనలు పాటించకుండా వెనక భాగంలో స్టిక్కర్లు వేసి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. నగరంలోని సాయిరెడ్డి పెట్రోల్ బంక్ వద్ద నూతనంగా ప్రారంభమయ్యే ఓ వస్త్ర వ్యాపార దుకాణం ఫ్లెక్సీ పోలీస్ బూత్‌ను మూసివేసి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారంటే బడా వ్యాపారులకు పోలీసులంటే ఏమాత్రం భయం ఉందో అర్థమవుతుంది. అంతేకాకుండా నగరంలోని పలు ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడానికి సైతం అనుమతులను పొందాల్సి ఉండగా ప్రస్తుతం వ్యాపారులు అలాంటి అనుమతులు ఏవీ తీసుకోకుండానే భారీ ఫ్లెక్సీలను, కటౌట్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలపై దృష్టి పెట్టాం..

:మంద మకరంద్, నగరపాలక సంస్థ కమిషనర్

నగర పాలక సంస్థ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించాం. ఆరోపణలు వచ్చిన వాటిపై టౌన్‌ప్లానింగ్ అధికారులతో నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

వస్త్ర షాపింగ్‌మాల్‌కు నోటీసులు జారీ..

సుభాష్‌నగర్: అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తడంతో నగర పాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం సాయంత్రం వస్త్ర షాపింగ్ మాల్ యజమానులకు నోటీసులు అందజేశారు. నోటీసులపై తిరిగి సమాధానం ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సైతం నోటీసులు ఇస్తున్నట్లు సమాచారం. ఫైర్ అండ్ సేఫ్టీ నుంచి కూడా అనుమతులు లేకపోవడంతో వారి నుంచి కూడా నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిసింది.



ఈ విద్యా సంవత్సరం నుంచే
బీఈడీలో నూతన సిలబస్

డిచ్‌పల్లి, సెప్టెంబరు 24: ఈ విద్యా సంవత్సరం నుంచి తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ నూతన సిలబస్‌ను ప్రవేశ పెట్టిన సందర్భంగా ఆడిట్ సేల్ అధికారులు మంగళవారం దానికి సంబంధించిన బ్రోచర్‌ను రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి ఆవిష్కరించారు. నేడు వర్సిటీ ఈ నూతన సిలబస్‌పై ప్రత్యేకంగా అవగహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంటా చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమానికి అన్ని అనుబంధ బీఈడీ కళాశాలల ప్రిన్సిపాళ్లు హాజరుకావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమానికి ప్రొ. అరుణ ఆడిట్ సేల్ జాయింట్ డైరెక్టర్ అతిక్ సుల్తాన గోరీ, వర్సిటీ ఎడ్యుకేషన్ విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ డా.శంకర్‌లు పాల్గొంటారని తెలిపారు. అనంతరం పాఠ్యంశం ప్రణాళికపై డా.శంకర్, డా.వేద ప్రకాశ్‌తో అవగహన కార్యక్రమాలు ఉంటాయని చంద్రొశేఖర్ తెలిపారు.

మేనేజ్‌మెంట్ విభాగంలో స్పెషలైజేషన్ ఎంపికపై సెమినార్

డిచ్‌పల్లి, సెప్టెంబరు 24 : తెలంగాణ విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ విభాగంలో స్పెషలైజేషన్ ఎంపికపై సెమినార్ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో స్పెషలైజేసన్ ప్రాముఖ్యతను వివరించారు. మారుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో విద్యార్థులు నైపుణ్యాలు నేర్చుకోవాలని వివిధ స్పెషలైజేషన్‌లలో ప్రావీణ్యం సంపాదించాలని విద్యార్థులకు ఉద్బోధించారు. సెమినార్ డైరెక్టర్ అంజనేయులు విద్యార్థులకు స్పెషలైజేషన్ ఎంపికలో పదతులను వివరించారు. వర్సిటీ పరిధిలోని గౌతమి, నిశిత, వర్సిటీ ఎంబీఏ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విదార్థులకు ప్రొ. కైసర్ మహమ్మద్, అపర్ణ, రాజేశ్వరి, వాణి, విద్యార్థులకు అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ సేల్ డైరెక్టర్ ఆచార్య ఘంట చంద్రశేఖర్, రాంబాబు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్యశిబిరం

ముప్కాల్, సెప్టెంబరు 23: బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్ లయన్స్ భవన్‌లో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దంత వైద్య నిపుణుడు డాక్టర్ నిహార్ 140మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. గ్రామంలోని 50మంది దంత పరీక్షలు నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జ్ఞానసాగర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దినేష్ బాయ్‌పటేల్, చాకు లింగం, పెంట జీవన్, పోతు ప్రసాద్, వంశీరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేందర్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ 7 గేట్ల ఎత్తివేత

● ప్రాజెక్టులోకి 45వేల క్యూసెక్కుల నీరు చేరిక

డొంకేశ్వర్, సెప్టెంబరు 24: ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు విష్ణుపురి గేట్లను ఎత్తివేయడంతో ప్రాజెక్టులోకి 45వేల858 క్యూసెక్కుల వరదనీరు చేరుతుండడంతో ప్రాజెక్టు ఏడు వరద గేట్లను గోదావరిలోకి 21వేల868క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్టు ప్రాజెక్టు ఏఈఈ వంశీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులోకి ఉదయం 29వేల వరద నీరు చేరగా ప్రాజెక్టు నాలుగు గేట్లను ఎత్తి 12వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మధ్యాహ్నం ప్రాజెక్టులోకి 45వేల 858క్యూసెక్కుల నీరు వరద పెరగడంతో ఏడు వరద గేట్లను ఎత్తి 21వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి వరదకాలువ ద్వారా 15వేల క్యూసెక్కుల, కాకతీయ కాలువకు 6800క్యూసెక్కుల ఎస్కేప్ గేట్ల ద్వారా 1200క్యూసెక్కుల, అలీసాగర్, గుత్పకు 180క్యూసెక్కుల అవిరి రూపంలో 700క్యూసెక్కుల నీరు విడుదల జరుగుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00 అడుగులు (80.5టీఎంసీ)లు కాగా సోమవారం సాయంత్రానికి 1091.00 అడుగులు (80.501టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని ఎస్సారెస్పీ అధికారులు తెలిపారు. జూన్ ఒకటోవ తేదీ నుంచి ప్రాజెక్టులోకి 190టీఎంసీల నీరు చేరగా ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా ప్రధానకాలువల ద్వారా 118టీఎంసీల నీరు విడుదల చేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

వేల్పూర్, సెప్టెంబరు 23: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామానికి చెందిన జాబిరి రమేష్ అన్న జాబిరి మహేష్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ మంగళవారం మృతుల కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలియజేశారు. మృతుని కుటుంబం నిరుపేద కుటుంబం కావడంతో రూ.10వేల ఆర్థిక సహయాన్ని కాంగ్రెస్ నాయకుల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సునీల్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

'విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి'

భీమ్‌గల్, సెప్టెంబరు23: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల వివరాలు ప్రశస్త్ యాప్‌లో నమోదు చేయాలని మండల విద్యాధికారి స్వామి తెలిపారు. మంగళవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో ఒక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో స్వామి మాట్లాడుతూ ప్రతీ పాఠశాల హెచ్ఎం దివ్యాంగ విద్యార్థులను గుర్తించి ప్రశస్త్ యాప్‌లో లాగిన్ అయి వారి వివరాలను పొందుపర్చాలని సూచించారు. ఈ శిక్షణలో ఐఈఆర్‌పీలు జలంధర్, కిషన్, ఐఈ ఉపాధ్యాయుడు రామకృష్ణ, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా దినోత్సవం

భీమ్‌గల్, సెప్టెంబరు 23: పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ విద్యార్థిని విద్యార్థులు ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌తో పాటు సమాజ సేవ చేస్తూ సమాజాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుమలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.సుదర్శన్, అకాడమి కో ఆర్డినేటర్ డాక్టర్ బి.శ్రీనివాస్, అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



నూతన కమిటీని అభినందిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే పోచారంను కలిసిన వర్ని ఏఎంసీ కమిటీ

వర్ని, సెప్టెంబరు 24: వర్ని మండల నూతన మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సురేష్ బాబాతో పాటు డైరెక్టర్ల నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డిని ఆయన నివాసంలో చందూర్ మండల నాయకుల ఆధ్వర్యంలో కలిశారు. చందూర్‌కు చెందిన వేములపల్లి సుధాకర్ రావు, ఎస్‌కే.ఫైమద్‌లను డైరెక్టర్లుగా నియమించినందుకు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ ప్యారం అశోక్ యాదవ్, బి.సత్యనారాయణ, కర్లం సాయిరెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గొర్తి వెంకటేశ్వర రావు, సలీం, వసంత రావు, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం



ఏఎంసి చైర్మన్ గంగారెడ్డిని సన్మానిస్తున్న బాడ్సి సొసైటీ పాలకవర్గం

మోపాల్, సెప్టెంబరు 24: నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముప్ప గంగారెడ్డి నియమితులైన సందర్భంగా మంగళవారం మండలంలోని బాడ్సి ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు ఘనంగా సన్మానించారు. పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని గంగారెడ్డి ఈ సందర్భంగా కోరారు. సొసైటీ చైర్మన్ వెంట పాలకవర్గం సభ్యులు, సొసైటీ కార్యదర్శి తదితరులు గంగారెడ్డిని సన్మానించిన వారిలో ఉన్నారు. అలాగే రాజాకుర్దు మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జలేందర్‌రెడ్డి కూడా గంగారెడ్డిని ఘనంగా సన్మానించారు. అదేవిధంగా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఆయనను సన్మానించిన వారిలో ఉన్నారు.

గంగాసారంలో ఇంటిపై పిడుగు

డొంకేశ్వర్, సెప్టెంబరు 23: ఇంటిపై పిడుగు పడిన ఘటన డొంకేశ్వర్ మండలం గంగాసారం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గంగసరం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి భారీ గాలి, దుమారం, ఉరుములు, మెరుపులు వచ్చాయి. ఈ క్రమంలో అచ్చకారి చిన్నభోజారెడ్డి ఇంటిపై పిడుగు పడింది. ఆ సమయంలో ఇంట్లో కుటుంబసభ్యులు నిద్రిస్తు న్నారు. ఎవరికి ఏలాంటి ప్రమాదం జరగలేదు. పిడుగు దాటికి కొంత స్లాబ్‌కు రంధ్రపై ధ్వంసం కాగా పిడుగుపాటుతో కరెంటు మీటర్లు మంటలు ఏర్పడి కొన్ని ఇంట్లో ఎలక్ట్రానిక్ వసుతవులు, టీవీ, ఫ్రీజ, కూలర్, ఏసీ ధ్వసం అయి నట్టు బాధితుడు తెలిపారు. అలాగే పిడుగుపాటుకు 20వరకు ఫ్యాన్‌లు, టీవీలు చెడిపోయినట్టు గ్రామస్థులు తెలిపారు. పిడుగుపాటుకు గంగాసారం గ్రామంలో భారీ నష్టం జరిగినట్టు గ్రామస్థులు తెలిపారు.

పార్ట్‌టైం ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవీపేట, సెప్టెంబరు 24: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు పార్ట్‌టైం ఉపాధ్యాయుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ జైనాథ్ రాజ్ తెలిపారు. పాఠశాలలో పీజీటీ ఫిజిక్స్, పీజీటీ బోటమి పోస్టులు ఖాళీగా ఉన్నాయని సంబంధిత సబ్జెక్టుతో పాటు పీజీ, బీఈడీ అర్హత గల అభ్యర్థులు ఈ నెల 26లోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలను మరుసటి రోజు నిర్వహించనున్నామని ఆయన పేర్కొన్నారు.

జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

మోర్తాడ్, సెప్టెంబరు24: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని జి.రితిక హైదరాబాద్‌లోని రమ్యాగ్రౌండ్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి 43వ జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైందని పాఠశాల పీఈటీ సింధుజ తెలిపారు. హర్యాలో ఈనెల 26నుంచి 30వ తేదీ వరకు జరగనున్నయని తెలిపారు. ఎంపికైన రితిక బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్ష, కార్యదర్శులు మానస గణేష్, శ్యామ్, పాఠశాల హెచ్‌ఎం తమ్మిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

కొనసాగుతున్న శిక్షణ

కోటగిరి, సెప్టెంబరు 24: మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ మంచినీటి సహాయకులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు మంగళవారం రెండవ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా మిషన్ భగీరథ డీఈ మున్నీ నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో మంచినీటి సహాయకులకు శిక్షణ ఇస్తుందన్నారు. చేతి పంపుల నిర్వహణ, మరమ్మతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో చందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

డొంకేశ్వర్, సెప్టెంబరు24: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేశారు. ఈ ఘటన డొంకేశ్వర్ మండల కేంద్రంలో సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం డొంకేశ్వర్ శివారులో పేకాట ఆడుతున్న పక్క సమాచారంతో పోలీసులు దాడి చేశారు. అక్కడ ఆడుతున్న డొంకేశ్వర్ గ్రామానికి చెదిన తొమ్మిది మందిని వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.14వేల 800 నగదుతో పాటు తొమ్మిది బైక్‌లు, ఆరు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

కోటగిరి: పొతంగల్ మండలంలోని టాక్లీ గ్రామ శివారులో మంగళవారం పేకాట స్థావరంపై ఎస్‌ఐ సందీప్ దాడి చేశారు. పేకాటస్థావరంలో 10,740 రూపాయల నగదుతో పాటు నలుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేశామన్నారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కాలువలో పడి మహిళ గల్లంతు

మోస్రా,సెప్టెంబరు 24: నిజామాబాద్ రూరల్ మండలంలోని కొత్తపేట్ గ్రామానికి చెందిన పెద్దోళ్ల లక్ష్మి(48)అనే మహిళ మంగళవారం నిజాంసాగర్ ప్రధాన కాలువలో పడి గల్లంతు అయినట్టు ఎస్సై రామారావు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పెద్దోళ్ల లక్ష్మి ఆమె భర్త లింగం, కొడుకు, కూతురితో కలిసి గ్రామ శివారులోని నిజాంసాగర్ కాలువలో బట్టలుతుకుతుండగా లక్ష్మి ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడిపోయింది. గమనించిన భర్త గట్టిగా అరిచి కాపాడేందుకు కాలువలో దూకాడు. వెంటనే స్థానికులు లింగంను కాపాడారు. లక్ష్మి కాలువ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. మంగళవారం రాత్రివరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ఇసుక వేలం పాట

కోటగిరి,సెప్టెంబరు 24: పొతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఇసుక వేలం పాట నిర్వహించారు. సుంకిని గ్రామ సమీపంలో 10 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసి వేలంపాట నిర్వహించగా సుంకిని గ్రామానికి చెందిన రమేష్ అనే వ్యక్తి 25 వేలకు ఇసుకను వేలంలో దక్కించుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

టిప్పర్ పట్టివేత

రుద్రూరు, సెప్టెంబరు 24: రుద్రూరులో ఓ ఇసుక టిప్పర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై సాయన్న పేర్కొన్నారు. మంగళవారం ఇసుకను అక్రమంగా కోటగిరి నుంచి బోధన్‌కు తరలిస్తుండగా రుద్రూరులో ఇసుక టిప్పర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు.

పార్టీలకతీతంగా సేవ చేస్తా

● ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 23: ప్రజలందరికీ పార్టీలకతీతంగా సేవ చేయడానికే వచ్చానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మె ల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయంగా మాట్లాడే వారి మాటలకు సమాధానం చెప్పావల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా అనారోగ్యంతో గాని, శ్రస్త చికిత్స కోసం ఆసుపత్రిలో చేరితే సీఎం సహాయనిధి, ఎల్‌వోసీ, ఢిల్లీలో రాయితీ ఇప్పించే బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్యే అన్నారు. గత ప్రభుత్వంలో సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఆరోగ్య శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ పేరిట కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, పరిసరాల శుభ్రతే కాకుండా ప్రజల ఆరోగ్యంతో పాటు పరిసరాల శుభ్రతే కాకుండా ప్రజల ఆరోగ్యం కూడా బాగుండాలన్నారు. ప్రతీఒక్కరు సంస్కారం, స్వచ్ఛతగా ఉండాలని, అప్పుడే ఈ దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, సర్వసమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు, కలిగోట గంగాధర్, జెస్సు అనిల్, యామాద్రి భాస్కర్, సుంకరి రంగన్న, ఆకుల శ్రీనివాస్, పొల్కం వేణు, ఖాందేశ్ ప్రశాంత్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాల ఏర్పాటు అభినందనీయం

రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం ద్వారా అపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయడమేనని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మామిడిపల్లిలో ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నర్సింహం నాయుడు జన్మదినం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోటపాటి నర్సింహం నాయుడు ఆర్మూర్ ప్రాంత రైతులకు, గల్ఫ్ కార్మికులకు గత కొన్నేళ్లుగా సేవలందిస్తున్నారని నిస్వార్థంగా చేస్తున్న ఆయన సేవలకు తోడుగా యువకులను సమీకరించి రక్తదాన శిబిరం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకులు లోక భూపతిరెడ్డి, బద్దం లింగారెడ్డి, గోవింద్‌పేట్ ఆనంద్, రుక్మాజీ, అంకారిగారి శంకర్, కె.రమేష్, భాస్కర్, జీజీ రాం, నాగరాజు, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు భూస అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయులదే అత్యున్నత స్థానం

● కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజా శ్రీనివాస్



కమ్మర్‌పల్లిలో ఉత్తమ ఉపాధ్యాయులతో మండల అధికారులు

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 24: సమాజంలో ఉపాధ్యాయులదే అత్యున్నత స్థానం అని భావిభారత పైరులుగా తీర్చిదిద్దడంలో వారి పాత్ర అమోఘమని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజా శ్రీనివాస్ అన్నారు. ఉపాధ్యాదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక మండలప్రజాపరిషత్ సమావేశ మందిరంలో మండల విద్యాశాఖ అద్వర్యంలో భాస్కర ఫార్మసిస్ వ్యవస్థాపకుడు భాస్కర్ యాదవ్ సహకారరంతో మండల ఉత్తమ ఉపాధ్యాయులు సన్మాన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎన్ ఆంద్యయ్యతో కలిసి ఆయాన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషితోనే ఎందరో ఉన్నత స్థాయిలో నిలుస్తున్నారని విద్యాబోధన చేసే ప్రతీ ఉపాధ్యాయుడు ఉత్తమ ఉపాధ్యాయుడేనన్నారు. ఈ కార్యక్రమంలోమండల నోడల్ అధికారి గంగాధర్ సన్మాన గ్రహీతలు పాల్గొన్నారు.

రుద్రూరు ఎంపీవోగా లక్ష్మణ్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



ఎంపీవో లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు, తదితరులు

రుద్రూరు, సెప్టెంబరు 31: రుద్రూరు నూతన ఎంపీవోగా లక్ష్మణ్‌రెడ్డి మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన నిజామాబాద్ డీఆర్‌డీఏ నుంచి బదిలీపై రుద్రూరుకు ఎంపీవోగా వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సురేష్‌బాబు, మండల పంచాయితీ కార్యదర్శులు, మండల ప్రజాప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నారోజీ గంగారాం, నాగేందర్, పత్తి రాము, లక్ష్మణ్, తోట్ల పెద్ద గంగారాం, బాల్‌రాజ్, ఏపీవో రాజేశ్వర్, మండల పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ రాజశ్రీ

మాక్లూర్, సెప్టెంబరు23: విద్యార్థులు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ రాజశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని దాస్‌నగర్ గ్రామశివారులో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ మహిళ డిగ్రీ కళాశాలలో ఆరోగ్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థినులకు రక్త నమూన, రక్తహీనత గల పిల్లలకు తదితర అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి కళాశాలతో పాటు గ్రామాల్లో కూడా ప్రతీఒక్కరికి ఆరోగ్యం పట్ల అప్రమత్తం చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో అంజన, డాక్టర్ అశోక్, డాక్టర్ రవితేజ, డాక్టర్ లావణ్య, డాక్టర్ తుకారం తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మునిగి జాలరి మృతి



మృతి చెందిన పల్లికొండ భూమన్న

నవీపేట,సెప్టెంబరు 24: మండలంలోని మహంతంకు చెందిన పల్లికొండ భూమన్న(61)అనే జాలరి కాళ్లకు వల చుట్టుకుని చెరువులో ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందాడని ఎస్ఐ వినయ్ తెలిపారు. ఈ నెల 22న సాయంత్రం గ్రామ శివారులోని కండ సముద్రం చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి రాత్రి అయినప్పటికీ ఇంటికి చేరుకోలేదని అన్నారు. మరుసటి రోజు అతని ఆచూకి గురించి గాలించినప్పటికి లభ్యం కాలేదని మంగళవారం స్థానిక చెరువులో అతని మృతదేహం బయటపడిందని ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడి కుమారుడు పల్లికొండ సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జేసీబీ, ఇసుక లారీ సీజ్

కోటగిరి,సెప్టెంబరు 24: పొతంగల్ మండలంలోని జల్లాపల్లి ఫారం గ్రామంలో మంగళవారం భారీ ఇసుక లారీతో పాటు జేసీబీని సీజ్ చేసినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. జల్లాపల్లి ఫారంలో అక్రమంగా ఇసుక డంప్ చేసి జేసీబీ సాయంతో భారీ లారీలలో ఇసుక నింపుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు అప్పగించడంతో పాటు మైనింగ్, ఎంవీఐ అధికారులకు సమాచారం అందించామన్నారు. అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అవినీతిపై విచారణ జరిపించాలి

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 24: మండలంలోని సుర్బిర్యాల్ గ్రామస్థులు తాజామాజీ సర్పంచ్ సబిత గణేష్‌పై అవినీతిపై విచారణ జరపాలని మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలో సర్పంచ్ భర్త గణేష్ దళిత బంధు డబ్బులతో ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపట్టడంతో సర్వజన సంఘం వారు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. దీంతో సర్వజన సంఘం సభ్యులు గణేష్‌కు మధ్య గొడవకు కారణమైంది. ఈ విషయమై గణేష్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గ్రామస్థులు ఇంటికోకరు చొప్పున పోలీస్‌స్టేషన్ ఆవరణలో భైటాయించారు. గణేష్‌పై విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఏసీపీ బస్వారెడ్డి, తహసీల్దార్ గజానన్ గ్రామస్థులతో మాట్లాడి విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏసీపీ బస్వారెడ్డి మాట్లాడుతూ వీడీసీలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని కుల, గ్రామబహిష్కరణలతో పాటు జరిమానాలు విధిస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వీఆర్ఏలు

నవీపేట, సెప్టెంబరు 24: రెవెన్యూ శాఖలో పని చేస్తూ 61 సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏలను రెగ్యులర్ చేస్తూ వారి స్థానంలో కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరుతూ సంబంధిత వీఆర్‌ఏల వారసులు మంగళవారం తహ సీల్దార్ వెంకట రమణకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో 61సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏలు 3,797 మంది ఉన్నారని ప్రస్తుతం వారి వారసులు ఆయా మండల రెవెన్యూ కార్యాలయాలలో గత కొన్ని సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నారని అన్నారు. గతంలో వేలాది మంది వీఆర్‌ఏలను రెగ్యులర్ చేయడం జరిగిందని, మిగిలిన 3,797మంది 61సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏల వారసులకు జీవో నెంబర్ 81, 85ల ప్రకారం నియామక పత్రాలను ఇవ్వాలని వారు తమ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పెంటయ్య, నర్సయ్య, సుధాకర్, గంగాధర్, గీత, రేణుక, విజయ, జ్యోతి, సువర్ణ, తదితరులున్నారు.

'విద్యార్థిని చితకబాదిన టీచర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి'

మెండోర, సెప్టెంబరు 24: మెండోర మండలం పోచంపాడ్ గురుకుల పాఠశాలలో చదువుతున్న 6వ తరగతి విద్యార్థి మూడ్ రాజుపై విచక్షణ రహితంగా చితకబాదిన టీచర్ రాజేశ్వర్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసు కోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సంద ర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్, యూ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బిగాల నాగరాజ్, టీఎన్‌వీఎస్ నాయకుడు వెంటేష్‌లు మాట్లా డుతూ శుక్రవారం రాత్రి బాత్‌రూం వస్తుందని విద్యార్థి వెల్లడంతో ఆ సమయంలో డ్యూటీలో ఉన్న టీచర్ రాజేశ్వర్‌రెడ్డి, వాచ్‌మెన్ సురేష్‌లు విద్యార్థి రూంకు వచ్చి నువ్వు ఎక్కడికి వచ్చావని విద్యార్థి రాజుపై విచా క్షణ రహితంగా దాడికి పాల్పడ్డారని, అదే సమయంలో విద్యార్థితో రాజే శ్వర్‌రెడ్డి కొట్టినట్టు ఎవరితోనైన చెబితే ఇలాగే కొడతానని టీసీ ఇచ్చి ఇంటి కి పంపించాలని భయభ్రాంతులకు గురి చేస్తూ బేదిరించడం జరిగిందని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. ఈ విషయమై విద్యార్థి సంఘాల నాయకులు మెండోర పోలీస్‌స్టేషన్‌లో టీచర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సురేందర్‌ను వివరణ కోరగా విద్యార్థి ప్రహరీ వద్ద ఉన్న మరుగు దొడ్ల గోడ ఎక్కి బయటదూకి మరో ముగ్గురు విద్యార్థులతో బయట ఉన్న దుకాణాల వద్ద తినుబండారాలు కొనుగోలు చేసి రావడం జరిగిందని మందలించడం జరిగిందని, ఇలానే రెండవ మరో ముగ్గురు విద్యార్థులతో రాత్రి వేళ వెళ్లి గోడబయట దూకుతూ తినుబండరాలను కొనుగోలు చేసి వస్తుండగా మళ్ళీ ఎక్కడికి వెళ్లావని అడిగితే ఎలాంటి సమాధానం లేకపోవడంతో మందలించి విద్యార్థి తల్లి దండ్రులకు సమాచారం ఇవ్వగానే విద్యార్థి తల్లిదండ్రులు వచ్చి విద్యార్థిని ని తీసుకు వెళ్లారని, ఎలాంటి దెబ్బలు కొట్ట లేదని వివరించారు.



మెండోరలో నిరసన తెలుపుతున్న విద్యార్థి తల్లిదండ్రులు

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు

పెర్కిట్, సెప్టెంబరు 24: ఈనెల 21, 22 తేదీల్లో ఆర్మూర్ మండలం మిర్దాపల్లి గ్రామంలో నిర్వహించిన అంతర్ పాఠశాలల క్రీడోత్సవాల్లో ఆలూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.నరేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ గరడి రాజేష్, విద్యార్థులను అభినందించారు. క్రీడోత్సవాలలో ఆలూర్ పాఠశాల విద్యార్థులు మార్చ్‌ఫస్ట్‌లో ద్వితీయస్థానం, జూనియర్ బాలికల విభాగంలో కబడ్డీలో ద్వితీయస్థానం, బాలికల సబ్‌జూనియర్ వాలీబాల్‌లో ప్రథమ స్థానం, బాలుర సబ్ జూనియర్ కబడ్డీలో ప్రథమ స్థానంలో నిలిచారని పాఠశాల డైరెక్టర్ గరడి రాజేష్ తెలిపారు. ఈ కా ర్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజేష్, శౌరెడ్డి, నరేందర్, గణేష్, రాంప్రభు, సుబ్బారెడ్డి, శ్రీకాంత్, చిత్ర, హన్మాండు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను రక్షించిన పోలీసులు

మెండోర, సెప్టెంబరు 24: ఎస్సారెస్పీ రిజర్వాయర్‌లో ఆత్మహత్యా యత్నానికి యత్నించిన మహిళను మెండోర పోలీసులు రక్షించారు. ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం మోస్రా మండలం గోవూర్ గ్రామానికి చెందిన ఎరుకల పద్మ సోమవారం శ్రీరాంసాగర్ రిజర్వాయర్‌లో ఆత్మ హత్యాయత్నానికి యత్నించగా ఎస్సారెస్పీ అధికారులు, సిబ్బంది మహిళను గ్రహించి పోలీసులకు సమాచారం అందించడంతో హుటాహుటిన పోలీసులు వెళ్ళి మహిళనురక్షించి కుటుంబసభ్యులకు అప్పగించికౌన్సిలింగ్ ఇచ్చారు.

ఇద్దరు వ్యక్తులను చితకబాదిన గ్రామస్థులు

ఎడపల్లి, సెప్టెంబరు 24: పోచారం గ్రామంలో మంగళవారం గ్రామస్థులు ఇద్దరు వ్యక్తులను చితకబాదారు. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం ఎడపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మంగళవారం పోచారం గ్రామంలో ఈ నెల 19వ తేదీన ఆత్మహత్య చేసుకున్న మహిళ ఇంటికి వెళ్లారు. మహిళ ఆత్మహత్యకు సదరు వ్యక్తులే కారణమని ఆరోపిస్తూ గ్రామస్థులు వారిని చితకబాదారు.



వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు

వర్నిలో ముగిసిన క్రీడా పోటీలు

వర్ని, సెప్టెంబరు 24: వర్ని మండల కేంద్రంలో పీడీఎస్‌యూ 50వ వసంతాల సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని ఆ కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు నడిపింటి కార్తీక్ పేర్కొన్నారు. పీడీఎస్‌యూ విద్యార్థుల హక్కుల కోసం మరింత పోరాటం చేస్తోందని భరోసా ఇచ్చారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్, గోపాల్, అభయ్ సింగ్, మహేష్, రాకేష్, నాని తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శిగా రాజేశ్వర్



రాజేశ్వర్‌ను సన్మానిస్తున్న మోస్రా మండల ఉపాధ్యాయ బృందం

మోస్రా,సెప్టెంబరు 24: 2024-26కు సంబంధించి పీఆర్‌టీయూ టీఎస్ నిజామాబాద్ జిల్లా కమిటీ ఎన్నికల్లో మోస్రా జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు రాజేశ్వర్‌ను ఎన్నుకోగా జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన రాజేశ్వర్‌ను మండల శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎస్.రాములు, ప్రధానకార్యదర్శి ఎస్.విజయ భాస్కర్, మండల అసోసియేట్ అధ్యక్షుడు శత్రు, మండల మహిళా ఉపాధ్యక్షురాలు శోభాబాయి, మండల కార్యదర్శి శివశంకర్, మండల నోడల్ అధికారి మధుసూదన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎం.బాలాజీ రావు, మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

దుబ్బా తండాను పరిశీలించిన ఎంపీడీఓ

మోస్రా, సెప్టెంబరు 24: మండలంలోని చే నెంబర్ తండా దుబ్బను ఎంపీడీఓ ప్రవీణ్ రెడ్డి పరిశీలించారు. గ్రామంలో ఉన్న పలు సమస్యలు పరిష్కారం కోసం అన్ని విధాలుగా ప్రయత్నం చేస్తానని అదేవిధంగా గ్రామ పంచాయతీ కార్యాలయం నిర్మాణం కొరకు ఆర్జీ పెడతామని అన్నారు. గ్రామ పంచాయతీలో కార్యదర్శితో మాట్లాడి గ్రామ సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓతో పాటు కార్యదర్శి మహేశ్వరి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీరన్న తదితరులున్నారు.

పంట పొలాల రోడ్లకు నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న కంఠం గ్రామస్తులు

నందిపేట, సెప్టెంబరు 23: మండలంలోని కంఠం గ్రామంలో ఎస్సీ, బీసీ రైతుల పంట పొలాల్లో ఉన్న రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని డీసీసీ ఉపాధ్యక్షులు పెంట ఇంద్రుడు ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వర్షాలకు రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయని, పంట ఉత్పత్తులు పొలాల్లో నుంచి రావడానికి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. రోడ్ల మరమ్మతులకు రూ.20లక్షలు మంజూరు చేయాలని కోరారు. నిధుల మంజూరుకు హామీ ఇవ్వడంతో సుదర్శన్‌రెడ్డి రైతులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతులు పెంట ఇంద్రుడు, గురడి ప్రసాద్, సూది సుమన్ తదితరులు ఉన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

నందిపేట, సెప్టెంబరు 23: మండలంలోని చింరాజ్‌పల్లిలో ఉన్న శ్రీ కేదారేశ్వర ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నోవా అగ్రిటెక్ లిమిటెడ్ కంపెనీ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించింది. కంపెనీ సిబ్బంది బాబుసింగ్, జి.గణేష్ మాట్లాడుతూ రైతులకు పురుగు మందుల వాడకంపై అవగాహన కల్పించారు. వరి, పసుపు, మొక్కజొన్న, పంటలలో వచ్చే పురుగు, తెగుళ్ళను అరికట్టే సూచనలు, సలహాలు చేశారు. ఏ సమయంలో ఏ మందులు పిచికారి చేయాలో వివరించారు. శ్రీ కేదారేశ్వర ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ చైర్మెన్ కాపు వినయ్ కుమార్, డైరెక్టర్లు గుమ్ముల సాయిలు, సిబ్బంది, ఆయా మండలాలకు చెందిన రైతులు తదితరులు ఉన్నారు.

క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 23: ఆర్మూర్ మున్సిపల్ పరిధి మామిడిపల్లిలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన అర్బన్ మండలస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో మంగళవారం అభినందన సభ నిర్వహించారు. విద్యార్థులు మార్చ్ ఫస్ట్‌లో ప్రథమ బహుమతి, బాలుర జూనియర్ ఖోఖో పోటీలో ప్రథమ, ఖోఖో సబ్ జూనియర్ బాలుర పోటీలో ప్రథమ, ఖోఖో జూనియర్ బాలికల పోటీల్లో ప్రథమ స్థానంలో పొందడంతో అథ్లెటిక్స్‌లో ఏడు బహుమతులు గెలుచుకున్నారు. విద్యార్థులను అభినందించడంతో పాటు పీఈటీ రాజేశ్వర్‌ను ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య శ్రీనివాస్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ షేక్‌మున్న, కౌన్సిలర్‌లు రవిగౌడ్, కాశీరాం, ఆకుల రాము, నాయకులు పండిత్ పవన్, వీడీసీ సభ్యులు రవి, లక్ష్మన్, రాజన్న, శ్రీనివాస్, హెచ్‌ఎం రవిందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా చింత శ్రీనివాస్

నవీపేట,సెప్టెంబరు 24: ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా నవీపేటకు చెందిన చింత శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక ఆర్యవైశ్య సంఘంలో జరిగిన సభ్యుల సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించారు. శ్రీనివాస్ గతంలో సంఘం మండల అధ్యక్షుడిగా పని చేయగా రెండవ సారి ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఎన్నిక నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాసవి సేవాదళ్ అధ్యక్షులు పోల సుధాకర్ గుప్తా, బి.పురుషోత్తం గుప్తా, మహంకాళి విజయ్‌కుమార్‌లతో పాటు సంఘం సభ్యులు బాలకృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

ధర్మోరా బాధితునికి ఎల్‌వోసీ అందజేత

మోర్తాడ్, సెప్టెంబరు 24: మండలంలోని ధర్మోరా గ్రామానికి చెందిన సీహెచ్.రమేష్ తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో ఆయనకు ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించగా పేద కుటుంబానికి చెందిన వారు కావడంతో సమాచారం తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ మంగళవారం రూ.2లక్షల 50వేల ఎల్‌వోసీని సీఎం సహాయ నిధి నుంచి అందజేశారు. ఈ సందర్భంగా ఆపద సమయంలో ఆదుకున్న సునీల్‌కుమార్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు జిల్లా వ్యాప్తంగా పార్టీ సభ్యత్వ నమోదు

నిజామాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ బూత్‌లలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బీజేపీకి సిద్ధాంత కర్త అయిన ఆయన 108వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ప్రతీ పోలింగ్ బూత్ వారిగా 100 సభ్యత్వ నమోదు చేయనున్నామని ఆయన తెలిపారు. జిల్లాలో మొత్తం 1200 పోలింగ్ బూత్‌లలో ఈ కార్యక్రమం నేడు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పార్టీ నేతలందరూ పాల్గొంటారని తెలిపారు. బీజేపీకి సిద్ధాంత కర్తగా దీన్‌దయాల్ ఉపాధ్యాయ పనిచేయడంతో పాటు పేద వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారని అన్నారు. అంత్యోదయ కార్యక్రమం రూపకల్పనలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. జాతీయ స్థాయిలో శ్యాంప్రసాద్ ముఖర్జీతో పాటు దీన్‌దయాల్ ఉపాధ్యాయ ఎంతో కృషి చేశారని తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్

దేశ రక్షణ, పేదలకు అన్ని అందాలని ఆకాంక్షించారని అన్నారు. దేశ వ్యాప్తంగా ఒకేరోజు ఈ సభ్యత్వ నమోదు ద్వారా భారీ ఎత్తున కార్యక్రమాలు చేస్తున్నామని ఆయన తెలిపారు. సిద్ధాంతాలతో పాటు పార్టీ అన్ని గ్రామాల పరిధిలో బలోపేతం అయ్యేందుకు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, గద్దెభూమన్న, ఇతర నేతలు పాల్గొన్నారు.

వృత్తి శిక్షణ సంస్థల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 24: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మైనార్టీల కోసం ఏర్పాటు చేస్తున్న వృత్తి శిక్షణ కోర్సుల కోసం ప్రభుత్వ, ప్రైవేటు వృత్తి శిక్షణ సంస్థ నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటి ఎడ్యుకేషన్, హెల్త్, అకౌంటింగ్, కన్‌స్ట్రక్షన్, వెటర్నరి, డైరీ, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, హార్టికల్చర్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ, డ్రైవింగ్, ఎలక్ట్రానిక్స్‌పై వృత్తి శిక్షణ ఇచ్చి ఉద్యోగ కల్పన కొరకు వృత్తి శిక్షణ సంస్థలను ట్రైనింగ్ పార్ట్‌నర్‌లుగా నియమించేందుకు ప్రభుత్వ ప్రైవేటు వృత్తి శిక్షణ సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ వృత్తి శిక్షణ సంస్థలో జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ, టాస్క్, ఈజీఎంఎం, మెప్మాతో అనుసంధానమై ఉండాలన్నారు. స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్‌తో గుర్తింపు పొంది ఉండాలన్నారు. అర్హత కలిగిన వృత్తి శిక్షణ సంస్థలు దరఖాస్తులను మేనేజింగ్ డైరెక్టర్ టీజీఎంఎఫ్‌సి 5వ అంతస్తు హజ్ హౌజ్ నాంపల్లిలో అక్టోబరు 4లోపు అందజేయాలని తెలిపారు.

రేషనలైజేషన్ నిబంధనలు మార్చాలి

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 24: అశాస్త్రీయమైన రేషనలైజేషన్ ఉత్తర్వుల నిబంధనలు మార్చాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ధర్మేందర్, శ్రీకాంత్‌లు అన్నారు. జిల్లాలోని వివిధ పాఠశాలలను సందర్శిస్తూ ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒకే ఉపాధ్యాయుడు ఉండాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు సంవత్సరాల తరబడి కోరుతున్నా ప్రభుత్వం అశాస్త్రీయమైన రేషనలైజేషన్ ఉత్తర్వులను అమలు చేయాలని ఉత్తర్వులు ఇవ్వడం అసంబద్ధమని అన్నారు. 60 మంది విద్యార్థుల వరకు ఇద్దరు ఉపాధ్యాయులు బోధించాలని పేర్కొనడం సమంజసం కాదని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వాసు, జిల్లా ఉపాధ్యక్షుడు గంగాకిషన్, రత్నాకర్, గంగాధర్, శ్రావణ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'పొలంబాట'

సుభాష్‌నగర్, సెప్టెంబరు 24: రైతుల సమస్యల పరిష్కారానికి పొలంబాట కార్యక్రమాన్ని చేపడుతున్నామని టీజీఎన్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రవీందర్ అన్నారు. పొలంబాట కార్యక్రమం ద్వారా నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా అందిస్తామని అన్నారు. ఆటో స్టార్టర్ల వలన నిరంతరాయంగా మోటార్లు నడవడం వల్ల నీరు వృథా అవుతుందని అన్నారు. కెపాసిటర్లు పెట్టుకోవడం వల్ల మోటార్ల జీవితకాలం పెరుగుతుందన్నారు. పొలంబాట కార్యక్రమంలో వంగిన పోల్స్‌ను సరిచేయుట, లూజ్ లైన్‌లను సరిచేస్తూ, మధ్య స్తంభాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ అయితే వ్యవసాయదారులు 1912కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

పంచాయతీ సిబ్బందికి వేతనాలు చెల్లించాలి

ఖిల్లా, సెప్టెంబరు 24: జిల్లాలో గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందికి తక్షణమే పెండింగ్ బకాయిలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన పంచాయతీ సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు. గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందికి మూడు నెలల నుంచి తొమ్మిది నెలల వరకు బకాయిలు రావాల్సి ఉందని ఆమె అన్నారు. జీతాలు రాకుండా కార్మికుల కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. పీఆర్‌సీలో పంచాయతీ కార్మికులను గుర్తించి కనీస వేతనం 26వేలు ఇవ్వాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో గంగాధర్, గణేష్, వంశీ, రమేష్, హాఖీమ్, తదితరులు పాల్గొన్నారు.

హమాలీల ధర్నాను విజయవంతం చేయాలి

ఖిల్లా, సెప్టెంబరు 24: ఈనెల 30న నిర్వహించనున్న హమాలీల మహాధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రగతిశీల హమాలీ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు మోహన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బోర్డు ఏర్పాటు చేయాలని, హమాలీలు పనిభద్రతలు లేకుండా పనులు చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో గంగాధర్, మల్లేష్, కుంటయ్య, వీరయ్య, శ్రీనివాస్, శివకుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాజన సభలో వాడి వేడి చర్చ

సిరికొండ, సెప్టెంబరు 24: సహకార సంఘ మహాజన సభలో రుణమాఫీపై, నిధుల ఖర్చుపై వాడి వేడి చర్చ జరిగింది. మంగళవారం సొసైటీ చైర్మన్ గంగాధర్ అధ్యక్షతన జరిగిన వార్షిక మహాజన సభలో మొదట కార్యదర్శి గిరిరాజ్ ఆదాయ వ్యయ నివేదిక చదివి వినిపించారు. ఈ నివేదికపై రైతులు చర్చిస్తూ గత రుణమాఫీ విషయంలో సొసైటీ నిర్లక్ష్యం వహించడాన్ని తీవ్రంగా ప్రశ్నించారు. ఆన్‌లైన్ చేయకపోవడం వల్లే తమకు రుణమాఫీ కాలేదని రైతులు ప్రశ్నించారు. అలాగే సహకార సంఘంలో అవినీతి అక్రమాలపై నిలదీశారు. చైర్మన్ గంగాధర్ మాట్లాడుతూ.. రుణమాఫీ విషయమై ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు. డబ్బులను రికవరీ చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు నర్సయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఏఎల్‌ఎంకు తీవ్ర గాయాలు



సుభాష్‌నగర్, సెప్టెంబరు 24: విద్యుత్ షాక్‌తో ఏఎల్‌ఎం నాగన్నకు తీవ్ర గాయాలు అయ్యాయి. నగరంలోని డి-8 సెక్షన్ పరిధిలో ఏఎల్‌ఎంగా పని చేస్తున్న నాగన్న మంగళవారం ఉదయం ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ఏబిస్విచ్ తెరుచుకోకపోవడంతో విద్యుత్ షాక్ తగిలి ట్రాన్స్‌ఫార్మర్‌పై నుంచి కిందపడిపోయాడు. శరీరానికి మంటలు అంటుకోవడంతో అక్కడే ఉన్న లైన్‌మన్ మోహన్ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన నాగన్నను ఎస్ఈ రవీందర్, డీఈ శ్రీనివాస్, ఏడీఈ వీరేశం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. మెరుగైన చికిత్స కోసం నాగన్నను హైదరాబాద్‌కు తరలించారు.

దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

ఖిల్లా, సెప్టెంబరు 24 :నగరంలోని మూడవ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని గౌతంనగర్‌కు చెందిన మాధవ్ అనే వ్యక్తిపై దాడి చేసి కన్ను వద్ద గాయం చేసిన వ్యక్తి పవన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. 28 ఆగస్టున గౌతంనగర్ వద్ద గల ఓ కిరాణ దుకాణం వద్ద మద్యం మత్తులో ఉండి రోడ్డుపై న్యూసెన్స్ చేస్తుండగా మాధవ్ ఎందుకు న్యూసెన్స్ చేస్తున్నావని వారించడంతో మత్తుమత్తులో ఉన్న పవన్ మాధవ్‌పై దాడి చేసి గాయపర్చిడాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేసి పవన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారు ఎవరైనా సహించేది లేదని ఎస్ఐ మహేష్ తెలిపారు.

మహిళ హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

నిజామాబాద్ లీగల్, సెప్టెంబరు 24: అరుణ అనే మహిళను హత్యచేసిన ఒడ్నాల కాశామణి, సుతారి చిన్నబాలయ్య అలియాస్ బాలబోయిలకు జీవిత కారాగార శిక్ష విధిస్తూ జిల్లా షెడ్యూల్డ్ కులాల స్పెషల్ జడ్జి టి. శ్రీనివాస్ మంగళవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే... కామారెడ్డి జిల్లా గాంధారి మండలానికి చెందిన అరుణ అనే మహిళతో మొదేలి గ్రామ నివాసులైన ఒడ్నాల అంజయ్యకు వివాహేతర సంబంధం ఉంది. అంజయ్య భార్య కాశామణి అరుణ భర్తకు, వారి బంధువులకు వివాహేతర సంబంధం విషయంలో నచ్చజెప్పినా వినకపోవడంతో విసుగు చెందిన ఒడ్నాల కాశామణి, తన బంధువైన చిన్నబాలయ్య సహాయంతో అరుణను హత్యచేయాలని భావించి బాలయ్యకు 5వేల రూపాయలు ఇస్తానని హత్యకు సహకరించాలని చెప్పి 29 ఆగస్టు 2019న అరుణను నమ్మించి బాన్సువాడ శివారులో గల గాదిఫూట్ గేట్ దగ్గర కెనాల్‌కట్ట వద్దకు తీసుకెళ్లి తన వెంట తెచ్చుకున్న తాడుతో అరుణ మెడకు బలంగా బిగించి బండరాళ్లతో ఆమె తలపై కొట్టి చంపేసారు. బాన్సువాడ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణలో వీరిద్దరిని కోర్టుకు తరలించగా పీపీ బంటు వసంత్ పోలీసువారి తరఫున వాదించగా కోర్టులో నేరం రుజువు కావడంతో ఇద్దరు ముద్దాయిలకు జీవితఖైదు శిక్ష విధిస్తూ, అధనంగా 3వేల రూపాయల జరిమానా విధిస్తూ, కట్టని యెడల మరో ఆరు నెలలు జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

సిరికొండ, సెప్టెంబరు 24: ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేయాలని ఆర్‌డబ్ల్యూ ఎస్ఈ రాజేంద్రకుమార్ అన్నారు. మండలంలోని గడ్కోల్ రైతువేదికలో రెండు రోజుల నుంచి కొనసాగుతున్న మంచినీటి సహాయకుల శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పంప్‌సెట్లు, నిర్వహణ, విద్యుత్ సమస్య తలెత్తితే ఎలా పరిష్కరించాలి అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈ హర్షద్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన తండా వాసులు

సిరికొండ, సెప్టెంబరు 24: మండలంలోని దూప్యాతండా పరిధిలో చోడ్‌పుంగ ఇటీవల వర్షాలకు తెగిపోవడంతో పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసి విన్నవించారు. చోడ్‌పుంగ కుంట వల్ల సమీప ప్రాంతాల్లో భూగర్భ జలాలు బాగా వృద్ధి చెందాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. చోడ్‌పుంగ కుంట తెగిపోవడం వల్ల భూగర్భ జలాలకు ఇబ్బంది ఏర్పడుతుందని దాని నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వారు ఎమ్మెల్యే భూపతిరెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు చందర్‌నాయక్, విడిసి సభ్యులు బాల్‌సింగ్ నాయక్, రాజునాయక్, రాజు, రవీందర్ నాయక్, తదితరులు ఉన్నారు.

ఎక్సైజ్ పోలీసుల అదుపులో గంజాయి కింగ్

- భద్రాచలం వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ప్రకటన
- గతంలోనూ గంజాయి సరఫరాపై పీడీ యాక్ట్ కేసు నమోదు
- ఇన్నాళ్లకు అసలు సూత్రధారి అరెస్టు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 24: ఇన్నాళ్లు జిల్లాకు ఎక్కడి నుంచి గంజాయి వస్తుందనేది ఎక్సైజ్ పోలీసులకు అంతుచిక్కలేదు. జిల్లాకు చెందిన గంజాయి కింగ్ రాజకీయాల్లోకి చేరడంతో ఎక్సైజ్ పోలీసులు అటువైపు దృష్టి సారించలేదు. అందులోనూ గంజాయి కింగ్ ఒక ప్రధాన పార్టీకి చెందిన కార్పొరేటర్‌కు కొడుకు కావడంతో అతనిపై నజర్ పెట్టలేదు. పోలీసులు గతంలో పీడీయాక్ట్‌ను కూడా నమోదు చేశారు. పీడీయాక్ట్ అనంతరం కొన్ని రోజులు స్తబ్దుగా ఉన్న గంజాయి కింగ్ తన పాత పద్ధతినే అవలంబించాడు. జిల్లాకు గంజాయి సరఫరా చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తూ గంజాయి సామ్రాజ్యాన్ని విస్తరించాడు. గ్రామ గ్రామాన గంజాయిని విస్తరించడంలో ఈ గంజాయి కింగ్ పాత్ర ప్రముఖంగా ఉంది. పైకి మామూలు వ్యక్తిలాగా కనిపిస్తూ చీకటి వ్యాపారాన్ని గ్రామ గ్రామాన విస్తరించి కోట్లకు పడగలెత్తాడు. తాజాగా భద్రాచలం ఎక్సైజ్ పోలీసులు జిల్లాకు చెందిన గంజాయి కింగ్‌ను అరెస్టు చేసినట్లు ప్రకటించారు. 319 కేజీల గంజాయిని జిల్లాకు సరఫరా చేస్తూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డారు. ఇందులో పది మంది నిందితులను, రెండు కార్లు, తొమ్మిది బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన సూత్రధారులైన సాదయ్య, అపర్ణ, అఖిల్‌ను అరెస్టు చేశారు. వీరు నిజామాబాద్‌కు గంజాయి సరఫరా చేస్తున్నట్లు ఒప్పుకున్నారు. వీరిని విచారించగా జిల్లాకు చెందిన గంజాయి కింగ్‌కు సరఫరా చేస్తున్నామని ఒప్పుకున్నారు.

రెండో రోజూ డీఎస్ స్మారక పోటీలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 24: రెండో రోజు డి.శ్రీనివాస్ స్మారక పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. సుమారు 1200 మంది క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొంటున్నారు. మంగళవారం వాలీబాల్ పోటీలు ముగిశాయి. వాలీబాల్ మొదటి స్థానంలో మహాత్మా జ్యోతిబాపూలే ధర్మారం నిలువగా, రెండవ స్థానంలో జీజేసీ బాల్కొండ నిలిచింది. బాలికల జూనియర్ కాలేజీ విభాగంలో మొదటి స్థానం మహాత్మా జ్యోతిబా పూలే దాస్‌నగర్, రెండవ స్థానంలో సుద్దపల్లి గురుకుల పాఠశాల నిలిచింది. హైస్కూల్ వాలీబాల్ విభాగంలో ప్రథమ స్థానం జడ్పీహెచ్‌ఎస్ ముగ్గిడి, రెండవ స్థానంలో పీఎంఆర్ ఐబీఎస్‌లు నిలిచాయి. బాలుర విభాగంలో మొదటి స్థానం పోచంపాడ్ గురుకుల పాఠశాల, రెండవ స్థానంలో టీజీఎంఆర్‌ఎఫ్ కళాశాల నిజామాబాద్ నిలిచాయి. బుధవారం విజేతలకు మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నారు. ఖోఖో, కబడ్డీ పోటీలను ప్రారంభించనున్నారు.

ఎండాకు తెగులుకు యూరియా వేయరాదు

ధర్పల్లి, సెప్టెంబరు 24: వరి పంటకు సోకే ఎండాకు తెగులును గమనించిన రైతులు తమ పొలానికి యూరియా వేయడం కొన్ని రోజులు నిలిపివేయాలని మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్ సూచించారు. మంగళవారం మండలంలోని రామడుగు గ్రామంలో పంట పొలాలను ఆయన పరిశీలించారు. వరికి దోమకాటు, ఆకు తెగుళు, కంకినల్లి, తదితర తెగుళు ఉన్నట్లు ఆయన చెప్పారు. రైతులు నివారణ చర్యలు సాధ్యమైనంత తొందరగా తీసుకుంటే పంట నష్టాన్ని అధికమించవచ్చని అన్నారు. బ్యాక్టీరియా, ఎండాకు తెగుళ సోకిన పంటకు అంచుల వెంబడి గోదుమ వర్ణంలో ఎండిపోవడం జరుగుతుందన్నారు. దీని నివారణ చర్యల కోసం యూరియా వేయడం తాత్కాలికంగా నిలిపివేసి మూరెట్ ఆఫ్ పొటాషియం 25కేజీలు ఒక ఎకరానికి వేసుకోవాలన్నారు. పొలంలో నీరు ఒక మడిలో నుంచి మరొక మడిలోకి వెళ్లకుండా నీటిని నిలిపివేయాలని సూచించారు. సుడిదోమ నివారణ కోసం పైమెట్రోజైన్ ఎకరానికి 120 గ్రాములు పిచికారి చేయాలన్నారు. కంకినల్లి సోకిన వరికి నివారణ చర్యలో భాగంగా క్లోఫోరైస్ లేదా స్పైరో మెసెఫిన్ 200 ఎంఎల్ ఎకరానికి పిచికారి చేయాలని సూచించారు. రైతులకు తెగుళపై సందేహాలు ఉంటే వెంటనే మండల వ్యవసాయ అధికారికి సంప్రదించాలని ఆయన సూచించారు.